www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| బుధవారం | 16-07-2025 |



## లోకల్‌బాడీలో పీకల్లోతుల్లోకి బీఆరెస్...!

### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**వాస్తవం ప్రతినిధి - నిజామాబాద్:**

బీసీ రిజర్వేషన్లు, రైతులకు రుణ మాఫీ, రైతుభరోసాతో బిఆర్ఎస్‌కు దిక్కుతోచడం లేదని అందుకే కావాలనే ఇతర అంశాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ మండిపడ్డారు. బిసిలపై మాట్లాడే హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు. కవిత చేస్తున్న డ్రామాలు ప్రజలు గుర్తిస్తు న్నారని అన్నారు. ఈ లోకల్‌బాడీ ఎన్నికల్లో బీఆరెస్ పీకల్లోతుల్లోకి కూరుకుపోవడం ఖాయమన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల పేరుతో 9ఏళ్లల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారీగా సంపాదించారని షబ్బీర్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, కరెంట్, జీతాలు తదితర విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ చేస్తోందని అన్నారు,. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. మిషన్ భగీరథ పెద్ద ఫ్రాడ్ అని తేలిందని అన్నారు. ధరణి ఒక దుర్మార్గమైన సాఫ్ట్‌వేర్ అని కూడా తేలిపోయిందని మండిపడ్డారు. ఏ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ళు రావడం లేదన్నా రు. పైపులు, ట్యాంకులు ఉన్నాయి గానీ నీళ్ళు రావడం లేదన్నారు.

# బీఆర్ఎస్ బీసీవాదం...అపహాస్యం...!

### దిద్దుకోలేని పొరపాటు..

### బీసీల మద్దతు కోసం తండ్లాట... బీఆరెస్ దిద్దుబాటు పాకులాట..

### హడావుడి మహాధర్నాపిలుపు.. పార్టీ గొడుగు కింద చేయలేని దుస్థితి..










(దండుగుల శ్రీనివాస్)

**బీఆరెస్ నెత్తికెత్తుకోవడానికి చేస్తున్న బీసీవాదం ప్రయత్నం అపహాస్యం పాలవుతున్నది. తొమ్మిదిన్నర సంవత్సరాలలో ఏ రోజూ కూడా.. శాసనసభలో కానీ పార్టీలో గానీ చర్చకు రాకుండా అడ్డుకున్న నాటి బీఆరెస్ సర్కార్.. నేడు కాంగ్రెస్‌ను చూసుకుని వాత పెట్టుకోవాలని చేసే యత్నం సోషల్ సర్కిళ్‌లో బెడిసికొడుతున్నది. కనీసం బీసీ సబ్‌ప్లాన్ కోసం అసెంబ్లీలో చర్చ జరుపుదామని ప్రయత్నించిన బీజేపీ నాయకులపై ఆగ్రహించిన బీఆరెస్.. ఇవాళ ఆ వాదం పేరుతో మార్కులు కొట్టేయడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల కోటాను తగ్గించడానికి పరోక్షంగా కారణమైన బీఆరెస్‌ను బీసీవాదంతో పోరాడుతున్న వారు నమ్మే పరిస్థితి లేదు.**

ఇప్పుడంతా బీసీ జపం నడుస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్టు కాంగ్రెస్ సర్కార్ ప్రకటించడమే తరువాయి.. దీనిపై ఎవరికి వారే బీసీల మద్దతు కోసం పాకులాడుతున్నారు. బీఆరెస్ మాత్రం ఈ బీసీల రేసులో బాగా వెనుకబడిపోయి.. బీసీలను ఓన్ చేసుకోలేక ఓడిపోయి వాడిపోతున్నది. అధికారంలో ఉన్నప్పుడు ఉన్న రిజర్వేషన్లను తగ్గించి అధికారమే పరమావధిగా చక్రాలు తిప్పి, వ్యూహాలు పన్ని తనను మించిన ఘనుడు లేడని అనుకున్న కేసీఆర్‌కు ఇప్పటి ఈ పరిస్థితి ఆశనిపాతంలా తాకింది. బీసీల నమ్మించే ప్రయత్నం చేసినా నమ్మేలా లేరు. కాంగ్రెస్‌కు మైలేజీ పోకుండా ఆపుదామన్నా అది సాధ్యమయ్యేలా లేదు. కానీ ఏం చేయాలి..? ఏదో చేయాలి..? ఏదో ఒకటి చేయాలి..! అందుకే హడావుడి పిలుపొకటి ఇచ్చాడు అధినేత కేసీఆర్. ఉన్నపళంగా అన్ని జిల్లాల నుంచి పది నుంచి ఇరవైమందికి తగ్గకుండా అంతా ఇందిరాపార్క్‌కు రావాలె. బీసీల మహాధర్నా చేపట్టాలె. అనుకున్నంత మంది రాకున్నా ధర్నా అయితే చేశారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నాచౌక్ వద్ద. అదీ పార్టీ గొడుకు కింద కాదు. బీసీల ప్రతినిధుల ఫోరం అట. అవే కండువాలు వేసుకుని, ఫ్లకార్డుల చేబూని.. అలా అలా ఏదో అయిందనిపించారు. ఓ కేటీఆర్, ఓ హరీశ్‌రావు.... మాట్లాడేందుకు రాలేదు. అక్కడ వారి ముఖం చెల్లదు. నమ్మేవారు లేరు. అసలు పార్టీ కండువానే అక్కడ కనిపించలేదు. అక్కడ కవిత బీసీల కోసం నేనే చేశానన్నది. కానీ ఆమే పార్టీ కండువా వేసుకోలేదు. మొత్తానికి గులాబీ కండువే బీసీలకు వ్యతిరేకి. అది వేసుకుని బీసీల కోసం మాట్లాడడమే పేద్ద పొరపాటని ఆ గులాబీ నేతలే గ్రహించారు.

### సొంత వారిని దూరం పెట్టేయ్..

# పొరుగువారికి తోడుపడవోయ్..!



**సొంతలాభం కొంత మానుకో.. పొరుగు వారికి తోడుపడవోయ్.. అని గురజాడ చెప్పింది ఇక్కడ కొంచెం మార్చి చెప్పాల్సి వస్తోంది. సొంత పత్రికలు, ఇంటి పత్రికలుగా ముద్రపడ్డ వాటిని సర్కార్ దూరం పెట్టేస్తున్నది. ఆంధ్రపత్రికలకు మాత్రం యాడ్స్ కుమ్మరించేస్తున్నది. మొదట్లో ప్రచారం బాగా కోరుకున్న సర్కార్.. చిన్నాపెద్దా తేడాలేకుండా అన్ని పత్రికలకూ యాడ్స్ ఇచ్చింది. ఆ తరువాత అప్పుల ఊబి, మిత్తీల భారం అని వల్లెవేస్తూ వస్తున్న సర్కార్.. అన్నీ పత్రికలకూ ఇస్తే ఎలా అనుకున్నదో ఏమో మరి.. కొన్నింటినే ఎంపిక చేసుకుంటున్నది. అందులో తెలంగాణ పత్రికలకు మాత్రం చోటుదక్కపోవడం ఇప్పుడు వివాదమై కూర్చింది.**




**(దండుగుల శ్రీనివాస్)**

అప్పుడు కేసీఆర్ ఇలాగే చేశాడు. తనకు అనుకూలంగా రాయకుపోతే.. వాటిని బాయ్‌కాట్ చేశాడు. అసలు జర్నలిస్టులుగానే చూడలేదు. నిషేధం విధించాడు. నియంతలా వ్యవహరించాడు. తన మానస పుత్రికకు మాత్రం వరదలా యాడ్స్ వచ్చి పడ్డాయి.ఇప్పుడీ సర్కార్ తనకు మద్దతుగా నిలిచిన వారిని వదిలి.. పొరుగు వారి సేవలో తరించిపోతున్నది. వారితో పెట్టుకుంటే బాగుండదనుకున్నదో.. మనోళ్లే కదా గప్‌చుప్ ఉంటారని భావించిందో తెలియదు. బకాయిలు పేరుకుపోయాయనే ఒక కారణం.. దుబారా ఖర్చుగా భావించే పరిస్థితిని కల్పించుకోవడం మరో కారణం.. ఇలా తప్పించుకుందామని చూసినా.. వీ6, వెలుగు మాత్రం దీన్ని వదలలేదు. బయటపెట్టి బజారు కీడ్చింది. ఇంతలా పోరాడితే ఇదేనా మీరు మాకు చేసిందని బాహాటంగానే తమను సర్కార్ అవమానించిందని తేల్చేసింది. మంత్రి వివేక్‌కు సంబంధించిన పత్రిక ఇలా బహిరంగంగా సర్కార్ తమను అవమానించిందని చెప్పుకోవడం ఇప్పుడు చర్చకు తెరలేపింది. కేసీఆర్ పాలనలో ఎన్నో అవమానాలను మీడియా ఎదుర్కొన్నది. కష్టనష్టాలకోర్చి ఏరికోరి తెచ్చుకున్న కాంగ్రెస్ సర్కార్ కూడా ఇదే పంథాలో పోతే.. ఇంతకన్నా దారుణం మరోటి లేదనేదే తెలంగాణ మీడియా, జర్నలిస్టుల ఆవేదన అని చెప్పుకున్నది వెలుగు, వీ6 మేనేజ్‌మెంట్.

# ఒడవని కాళేశ్వరం కహాని..!

### ఆ ఇంజినీర్లు అవినీతి తిమింగళాలు..

### కాళేశ్వరం కుంభకోణంలో మరో వికెట్

### విశ్రాంత ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధరరావు అరెస్ట్

### ఎసిబి సోదాల్లో భారీగా ఆస్తులు గుర్తింపు



**వాస్తవం ప్రతినిధి - హైదరాబాద్:**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నీటి పారుదల శాఖ విశ్రాంత ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధరరావును ఎసిబి అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్‌లో మురళీధరరావు నివాసంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం ఆయనను ఎసిబి అధికారులు అరెస్ట్ చేసినట్టు సమాచారం. హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ ప్రాంతాలలో పది చోట్ల ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. మురళీధర్ రావుకి సంబంధించిన కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లల్లో కూడా తనిఖీలు చేపట్టారు.

ఈ క్రమంలో భారీగా అక్రమ ఆస్తులను ఎసిబి అధికారులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మురళీధర్‌రావు కీలకంగా వ్యవహరించిన విషయం విదితమే. కాళేశ్వరం ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టుల కేటా యింపుల్లో భారీగా అవకతవకలు జరిగినట్టు- ఎసిబికి ఫిర్యాదులు వచ్చాయి. వాటి ఆధారంగా ఎసిబి అధికారులు జరిపిన సోదాలలో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు లభిం చినట్లు సమాచారం. ఇలా ఉండగా మాజీ ఇఎన్సీ మురళీధర్ రావును ఇటీవల కాళేశ్వ రం కమిషన్ విచారించిన విషయం తెలిసిందే. కాళేశ్వరం కమిషన్ జరిపిన విచారణలో మురళీధర్‌రావును అడిగిన ప్రశ్నలకు, తనకు తెలియదని, మర్చిపోయానంటూ సమాధానం చెప్పారు. ఇక విజిలెన్స్ నివేదికలోనూ మాజీ ఇఎన్సీ మురళీధర్ రావు పేరును చేర్చించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మురళీధర్‌రావు పదవీవిరమణ పొందగా, ఆ తర్వాత ఆయన పదవీకాలాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పొడిగించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయన కొంతకాలం పాటు- పదవిలో ఉన్నారు. మేడిగడ్డ కుంగిపోయిన ఘటన పై విజిలెన్స్ నివేదిక తర్వాత మురళీధర్‌రావును ప్రభుత్వం తొలగించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలపై ఎసిబి కూడా రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టులో గతంలో కీలకంగా పనిచేసిన అధికారుల అవినీతిపైన దృష్టిసారించిన ఎసిబి ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా పని చేసిన నూనె శ్రీధర్‌లను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మాజీ ఇఎన్సీ మురళీ ధర్ రావు ఇంట్లో సోదాలు నిర్వహించిన ఎసిబి అధికారులు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన ఉన్నారన్న అభియోగంపై ఆయన్ను తాజాగా అదుపులోకి తీసుకుంది. కాళేశ్వరం, మేడిగడ్డ అవినీతి, అవకతవకలపై ఇప్పటికే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేక మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. విజిలెన్స్ శాఖ విచారణ అనంతరం 17 మందిపై చర్యలకు సిఫార్సు చేయగా అందులో మాజీ ఇఎన్సీ మురళీధర్‌రావు కూడా ఉన్నారు.



# షకీల్‌కు వరుస షాకులు...!

### బోధన్ మాజీ ఎమ్మెల్యేకు చుక్కెదురు

**వాస్తవం ప్రతినిధి - హైదరాబాద్:**

బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోద్కెన కేసును కొట్టివేయాలని షకీల్ వేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. షకీల్‌పై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని ఆయన తరఫున న్యాయవాది అన్నారు. అయితే, ఈ కేసులో అభియోగపత్రం దాఖలు చేయాల్సి ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. షకీల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రజాభవన్ ఎదురుగా ఉన్న బారికేడ్లను ఢీకొట్టిన ఘటనలో షకీల్ కుమారుడు సాహిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. సాహిల్‌ను కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని షకీల్‌పై కూడా కేసు నమోద్కెంది.



ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్ శంకుస్థాపన